
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY 5

వనపర్తి
జిల్లా వార్తలు
మంగళవారం 22 అక్టోబరు 2024

సమాజ భద్రతకు పోలీసుల సేవలు వెలకట్టలేనివి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం : ఎస్పీ రావుల గిరిధర్

8



వనపర్తి పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్

సైజ్ తగ్గిన చేప పిల్లలు

- ఫిషరీస్ అధికారితో మత్స్యకారుల వాగ్వివాదం
- ఇష్టం ఉంటే తీసుకెళ్లండి లేదంటే వదిలేయండన్న అధికారులు
- అధికారులు కాంట్రాక్టర్‌కు వంతపాడుతున్నారని ఆగ్రహం

6



ఫిషరీష్ అధికారితో వాగ్వాదం చేస్తున్న మత్స్యకార సహకారం సంఘం అధ్యక్షుడు

జీహెచ్‌ఎంల సస్పెన్షన్‌తో
ఉలికిపాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- స్పాజ్ తప్పిదాలతో ఉపాధ్యాయుల్లో చర్చ
- తప్పిదాలు చేసినందుకే చర్యలు - విద్యాశాఖ అధికారులు
- జీహెచ్‌ఎంలంతా హర్షవర్ధన్‌రెడ్డి వద్ద పంచాయితీ

సస్పెన్షన్ అయిన జీహెచ్‌ఎంలు వీరే..

స్పాజ్ పాయింట్ల దుర్వినియోగంలో 10 మంది జీహెచ్‌ఎంల వివరాలను డీఈవో రవీందర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆర్జేడీ నుంచి వచ్చిన ఉత్తర్వులను జీహెచ్‌ఎంలకు, ఎంఈవోలకు, ఎంపీడీవోలకు పంపించినట్లు తెలిపారు. వనజ (జడ్పీహెచ్ఎస్ యన్‌మన్‌గండ్ల, నవాబ్‌పేట), సరస్వతి(జడ్పీహెచ్ఎస్ (బాలికల) బాలానగర్), నాగేంద్రమ్మ(జడ్పీఎచ్ఎస్ బాలికల, దేవరకద్ర), నాగ్యానాయక్(జడ్పీహెచ్ఎస్ నవాబ్‌పేట), యుగేందర్ (జడ్పీహెచ్ఎస్ ఆలూరు, జడ్చర్ల), వెంకటేశ్వరమ్మ(జడ్పీహెచ్ఎస్ కోడూర్, మహబూబ్‌నగర్ మండలం), కృష్ణవేణి(జడ్పీహెచ్ఎస్ కొండెడ్డిపల్లి, గండీడ్), కృష్ణయ్య(జడ్పీహెచ్ఎస్ ధర్మాపూర్, మహబూబ్‌నగర్ మండలం), చంద్రకళ(జడ్పీహెచ్ఎస్ బాలుర బాదేపల్లి, జడ్చర్ల), వెంకట్‌రెడ్డి(జడ్పీహెచ్ఎస్ పోలేపల్లి, జడ్చర్ల) సస్పెన్షన్ అయిన వారిలో ఉన్నారు.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్పాజ్ పాయింట్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయల సస్పెన్షన్ వేటు పడటం విద్యాశాఖలో ఒక్కసారిగా కలకలం రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది సెప్టెంబరు 2023లో జరిగిన ప్రధానోపాధ్యాయుల బదిలీలలో పలువురు జీహెచ్‌ఎంలు భార్యాభర్తలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా స్పాజ్ పాయింట్లను ఉపయోగించుకున్నారు. దీంతో అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది సెప్టెంబరు 2023 నుంచి 2024 జూలై వరకు ఈ స్పాజ్ పాయింట్ల దుర్వినియోగంపై వరుస కథనాలు వచ్చాయి. దీనిపై రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) విజయలక్ష్మి సుదీర్ఘంగా విచారణ చేశారు. పలువురు జీహెచ్‌ఎంలకు తీవ్ర అన్యాయం జరగిందని తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనాలను పలుమార్లు ఆర్జేడీ, విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

అధికారులు జీహెచ్‌ఎంల స్పాజ్ పాయింట్ల వినియోగంలో బదిలీల సమయంలో దరఖాస్తులు ఎలా చేసుకున్నారు? నిబంధనల మేరకే చేసుకున్నారా...? లేదా

మిగతా 6వ పేజీలో...

ట్రాఫిక్ జాం



- ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ అవస్థలు
- రహదారులపైనే వాహనాల పార్కింగ్
- రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు, తరుచూ ట్రాఫిక్ జామ్
- ప్రధాన పట్టణాల్లో 'ఆంధ్రజ్యోతి' విజిట్

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు లేకపోవడం, ఉన్న చోట పని చేయకపోవడం ప్రధాన సమస్యగా మారింది. వ్యాపార సముదాయాల్లోని సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో వాహనాలను రోడ్లపైనే నిలపాల్సి వస్తోంది. దీని వల్ల రాకపోకలకు ఆటంకం ఏర్పడి తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది. పుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించుకొని చిరువ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. మరికొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. దీంతో పాదచారులకు నడిచే దారి లేకుండా పోయింది. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

7

ఆంధ్రజ్యోతి విజిట్



వాహనాలతో రద్దీగా ఉన్న అయిజ కొత్త బస్టాండ్ ప్రాంతం

మట్టిమాఫియాపై అధికారుల ఆరా

- ఆంధ్రజ్యోతి కథనంతో సైలెంట్ అయిన మాఫియా
- నిన్నటిదాక పగలు రాత్రి రవాణా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) : ఏపీ నుంచి తెలంగాణలోకి వచ్చే ఎర్ర మట్టి రవాణపై అధికారులు ఆరా తీశారు. ఏయో అధికారుల కనుసన్నల్లో జరుగుతుందో వివరాలు సేకరించినట్లు తెలిసింది. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన మట్టిదందా కథనంపై చర్యలకు సిద్ధమయ్యారు ఉన్నతాధికారులు. అయితే స్థానిక అధికారులు ముందే ములాఖత్ కావడం వల్ల మట్టిమాఫియాకు అడ్డు చెప్పలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నిన్నటిదాక పగలు రాత్రి అన్నతేడా లేకుండా ఏపీ నుండి తెలంగాణలోకి మట్టిని తరలించి సొమ్ము చేసుకున్న ఏపీ మట్టిమాఫియ కేవలం రాత్రి పూట మాత్రమే తరలించాలన్న వ్యూహంతో ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా లేదా అనేదానిపై వేచి చూడాలి.

క్రైం న్యూస్..

కారు, బైక్ ఢీ యువకుడి మృతి



బుచ్చచారి (ఫైల్)

వంగూరు అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిలో తిర్మలగిరి వద్ద ఆదివారం రాత్రి కారు, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన బుచ్చచారి(28) తిర్మలగిరి బంక్ వద్ద పెట్రోల్ వేసుకుని డిండికి బైక్‌పై బయలుదేరాడు. ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న బుచ్చాచారి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎర్రవల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని శేకుపల్లిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. కొదండాపురం ఎస్‌ఐ స్వాతి కథనం ప్రకారం వనపర్తి జిల్లా అమరచింత మండలం కొంకోలోన్‌పల్లి గ్రామానికి చెందిన కుర్వబసమ్మ(50) బతుకుదెరువు కోసం భర్త లింగన్నతో శేకుపల్లికి వచ్చారు. ఆమెకు సంతానం కాలేదని జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుర్వ బసమ్మ చెల్లెలు శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు..

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారు జామున జడ్చర్ల - కోదాడ హైవేపై మార్చాల శివారులో గుర్తుతెలియని యువకుడి వయస్సు 23 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఎవరైనా సంబంధీకులు ఉంటే కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ఊకచెట్టు వాగుకు ఊపిరి



ఏదులాపూర్ సమీపంలో చెక్‌డ్యాంలో జలదృశ్యం

6

- ఇటీవల వానలకు అలుగు వారుతున్న వాగు
- వరద నీటిని ఒడిసిపడుతున్న చెక్ డ్యాంలు
- చుట్టు పక్క గ్రామాల్లో పెరిగిన భూగర్భ జలం

చదువుతోనే అన్నీ సాధ్యం

- సినీ నటి మంచు లక్ష్మి - జోగులాంబ గద్వాల జిల్లాలో 51 పాఠశాలలు దత్తత తీసుకున్నా



గట్టు మండలంలోని ఆలూరు ఎంపీపీఎస్ పాఠశాలలో తరగతి గదిని ప్రారంభిస్తున్న సినీనటి మంచు లక్ష్మి

గట్టు/గద్వాల న్యూటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే అన్నీ సాధ్యమౌతాయని, పిల్లలను తల్లిదండ్రులు చదివించాలని, వారిని పనులకు పంపకుండా ప్రతీ రోజు పాఠశాలకు పంపి ప్రయోజకుల్ని చేయాలని సినీనటి మంచు లక్ష్మి సూచించారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని ఆలూరు ఎంపీపీఎస్ పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూం ప్రారంభానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై స్మార్ట్ తరగతి గదిని ప్రారంభించారు. ముందుగా పాఠశాల విద్యార్థినులు నిర్వహించిన నృత్యాలను చూసి ఆమె కూడా కూర్చున్న చోటే డ్యాన్స్ చేశారు. అనంతరం మంచు లక్ష్మి మాట్లాడుతూ ఏదైనా మొదట కష్టంతోనే ప్రారంభమౌతుందని కష్టాన్ని అధిగమిస్తే విజయతీరాలకు చేరుకుంటామని విద్యార్థులకు చెప్పారు. అక్షరాస్యతలో వెనుకబాటు అనేది కాకుండా అందరం కలిసి భవిష్యత్‌లో ముందుకు తీసుకురావాలన్నారు. జిల్లాలో 51 పాఠశాలలను టీచ్ ఫర్ చేంజ్ సంస్థ దత్తత తీసుకున్నదని, అందులో గట్టు మండలంలో 21 పాఠశాలలు ఉన్నాయన్నారు. జోగుళాంబ దేవి ఆశీర్వదిస్తే జిల్లాలోని మొత్తం పాఠశాలలను దత్తత తీసుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాధికారి రవీంద్ర మాట్లాడుతూ మంచు లక్ష్మి అక్షరాస్యతలో వెనుకబడిన గట్టు మండలాన్ని మెరుగుపరిచేందుకు ఎంపిక చేసుకోవడం మన పిల్లల అదృష్టం అన్నారు. జిల్లా సమన్వయ అధికారి ఎస్తేర్‌రాణి, రామకృష్ణ, ఎంఈవో నల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామన్‌గౌడు, టీచ్ ఫర్ చేంజ్ జిల్లా కోఆర్డినేటర్ నాగేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తాం : కలెక్టర్

జిల్లాలో పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వపరంగా స్వచ్ఛంద సంస్థకు సహకారం అందిస్తామని కలెక్టర్ సంతోష్ చెప్పారు. సోమవారం ఆయనను కలెక్టర్ చాంబర్‌లో టీచ్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు మంచులక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న పాఠశాలలన్నింటినీ నేరుగా సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈఓ కాంతమ్మ, డీఈఓ రవీందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

బాల్య వివాహాలు అరికట్టాలి

వనపర్తి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల వల్లన తమ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేరని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్న వయసులో వివాహం చేసుకోవడం వల్ల శారీరక వృద్ధి కోల్పోతారని, ఆరోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. బాలికలు సైతం బాల్య వివాహాలను వ్యతిరేకించాలని, ఎవరైనా 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేసుకోవాలని ఇంట్లో ఒత్తిడి చేస్తే 1098 హెల్ప్ లైన్‌కు కాల్ చేయాలన్నారు. అక్టోబరు చివరి వారం చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ వీక్‌గా పరిగణించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మమ్మ, డీసీపీవో రాంబా బు, సంక్షేమ శాఖ సిబ్బంది భాస్కర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో

గట్టు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటి నుండే కష్టపడి చదివితే భవిష్యతులో ఫలితాలు వస్తాయన్నారు. ఆ దిశగా విద్యార్థులు చదువుకోవాలని కోరారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నల్లారెడ్డి, సమన్వయ అధిరారి హంపయ్య ఉన్నారు.

'స్వదేశీ దర్శన్' పనులకు
అటవీశాఖ అభ్యంతరం

- నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణం
- వెనుదిరిగిన రూ.1.50 కోట్ల నిధులు



వర్షం దాటికి కొట్టుకుపోయిన మల్లెలతీర్థం మట్టి రోడ్డు

దోమలపెంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మారుస్తామని పర్యాటక శాఖ మంతి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. ఇటీవల ఎమ్మెల్యేల బృందంతో నల్లమలలో పర్యటించిన సందర్భంగా ఆయన ప్రకటించారు. నాలుగు సంవత్సరాలుగా మల్లెలతీర్థం జలపాతం సందర్శననూ అటవీశాఖ అధికారులు నిలిపివేశారు. పదేళ్లక్రితం నల్లమల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా మల్లెలతీర్థం అభివృద్ధికి రూ.4.50 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇందులో వటువర్లపల్లి నుంచి మల్లెల తీర్థం జళపాతం వరకు ఎనిమిది కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు వటువర్లపల్లి, సార్లపల్లి, కుడి చింతల బావి గ్రామాలలో సీసీరోడ్డు నిర్మా ణం చేయాల్సి ఉంది. ఒక వటువర్లపల్లిలో మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణ పనులను తెలంగాణ టూరిజం శాఖ తరుపున చేశారు. సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు బీటీ రోడ్డును వేసేందుకు అటవీశాఖ అనుమ తి ఇవ్వకపోవడంతో ఆరేళ్లుగా పనులు నిలిచి పోయాయి. దీంతో రూ.1.50 కోట్ల నిధులు వెనుదిరిగాయి. పర్యాటకంగా నల్లమల ప్రాంతం అభివృద్ధి చెందుతున్న తరుణంలో అటవీ శాఖ అభ్యంతరాలతో నిధులు వెనుదిరుగుతున్నాయి. నల్లమల ఊటిగా పేరు గాంచుతున్న మల్లెలతీర్థం జళపాతానికి రోజు రోజుకు పర్యాటకుల తాకిడి పెరిగినప్పటికీ అటవీశాఖ అభ్యంతరాలతో మల్లెల తీర్థం జళపాతం సందర్శనకు అనుమతి నిరాకరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకు పోయింది. దీంతో రహదారి సక్రమంగా లేక వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మల్లెల తీర్థం జలపాతం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ అమలుకు నోచు కోలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎంపీ డాక్టర్ మల్లు రవి పర్యాటకాభివృద్ధికి కృషి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతల బావి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



మల్లెలతీర్థం వెళ్లేందుకు బీటీ రోడ్డు వేయిస్తానని నాలుగేళ్ల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి శ్రీనువాస్‌గౌడ్ హామీ ఇచ్చారు. కానీ నిధులు మంజూరు చేయలేదు. కాంగ్రెస్ పాలనలోనైనా ఎమ్మెల్యే కృషి చేయాలి. మట్టి రోడ్డుపై వాహనాలు తిరగడంతో దుమ్ము విపరీతంగా వస్తోంది. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. నాయకులు, అధికారులు స్పందించి బీటీరోడ్డు వేయించాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

- చిగుర్ల మల్లికార్జున్, మాజీ సర్పంచ్, సార్లపల్లి

ఊకచెట్టు వాగుకు ఊపిరి



చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి సమీపంలోని చెక్‌డ్యాం వద్ద అలుగు పారుతున్న దృశ్యం

- ఇటీవల వానలకు అలుగు పారుతున్న వాగు
- వరద నీటిని ఒడిసిపడుతున్న చెక్ డ్యాంలు
- చుట్టు పక్క గ్రామాల్లో పెరిగిన భూగర్భ జలం
- ఏడాది పాటు తాగు, సాగునీటికి లేని ధోకా

వానొస్తే గలగలా.. ఆ తర్వాత వెలవెలా అన్నట్లుగా ఉండేది ఊకచెట్టు వాగు పరిస్థితి. వర్షాకాలంలో వరద నీటిని ఒడిసి పట్టుకొనే అవకాశం లేక దిగువకు నీరంతా పారి రామన్‌పాడు జలాశయానికి చేరేది. దీంతో వాగంతా ఒట్టిపోయేది. ఈ నేపథ్యంలో వాగులో పలు చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించడంతో పరిస్థితి మారిపోయింది. ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉంటోంది. భూగర్భ జలమూ పెరిగింది. ఒక్క సారి వాగు పారితే ఏడాది పాటు తాగు, సాగు నీటికి ధోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- చిన్నచింతకుంట, ఆంధ్రజ్యోతి

వరద నీటిని ఒడిసి పడుతున్న చెక్ డ్యామ్‌లు ఊక చెట్టు వాగుకు ఊపిరి పోస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని కోయిల్ సాగర్ దిగువన, చిన్నచింతకుంట మండలంలో ఈ వాగు ఉంది. గతంలో వర్షాలు వచ్చినప్పుడు వరద నీరంతా దిగువకు ప్రవహించి, వనపర్తి జిల్లాలో మదనాపురం సమీపంలోని రామన్‌పాడు జలాశయంలోకి చేరేది. దీంతో వర్షాలు తగ్గగానే ఎగువనున్న ఊకచెట్టు వాగు ఖాళీ అయి వెలవెలబోయేది. అందువల్ల వాగు శివారు ప్రాంతాల్లోని గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి తాగు, సాగు నీటికి ఇబ్బంది కలిగేది. వేసవి కాలంలో సమస్య మరింత తీవ్రమయ్యేది. బోర్లు, బోవులు ఎండిపోయి సాగు, తాగు నీటిని అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో చిన్నచింతకుంట మండలంలో 10, నియోజకవర్గ వ్యాప్తంగా చెక్ డ్యాంలు నిర్మించారు. వాగు పరివాహక ప్రాంతంలోని బండర్‌పల్లి, ముచ్చింతల, పల్లమర్రి, లాల్‌కోట, నెల్లికొండి, వడ్డెమాన్, ఏదులాపూర్, చిన్నచింతకుంట, కురుమూర్తి, అల్లీపురం తదితర గ్రామాల పరిధిలో చెక్‌డ్యాంలు నిర్మించారు. దీంతో భూగర్భజలాలు పెరగడం వల్ల సాగు, తాగునీటికి ధోకా లేకుండా పోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండి అలుగు వారుతున్నాయి. వాగు పరివాహక ప్రాంతాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయ బోర్లలోనూ నీటి మట్టం పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతం కంటే వరి సాగు విస్తీర్ణం పెరిగింది. కురుమూర్తి, అమ్మాపూర్, పల్లమర్రి, కొౌకుంట్ల మండలం దాసర్‌పల్లి, ముచ్చింతల గ్రామాల శివారులో పండ్ల తోటలకు అనువైన వాతావరణం ఏర్పడింది. స్థానిక రైతులు అక్కడక్కడా చెరుకును కూడా సాగు చేస్తున్నారు. దీంతో పాటు డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, బత్తాయి, మామిడి వంటి పండ్ల తోటలకు చెక్‌డ్యాలు వరంగా మారాయి.

మూగ జీవాలకు కూడా తాగునీటి కొరత ఉండటం లేదు. అలుగు పారుతున్న చెక్‌డ్యాంలను సందర్శించేందుకు తరలివస్తున్న చుట్టు పక్క గ్రామాల ప్రజలతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి.

ఒక్క సారి వాగు నిండుగా ప్రవహిస్తే తాగు, సాగు నీటికి ఏడాది పాటు ఇబ్బంది ఉండదని రైతులు చెప్తున్నారు.

భూగర్భ జలాలు పెరిగాయి



చెక్‌డ్యామ్ నిర్మాణాల వల్ల సమీపంలోని వ్యవసాయ బోర్ల భూగర్భ జలాలు పెరిగి మాకు సాగునీటికి ధోకా లేకుండా పోయింది. అంతకుముందు ఊకచెట్టు వాగు పూర్తిగా వట్టిపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటేవి. ఈ కారణంగా వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గి సాగుకు ఇబ్బంది అయ్యేది. రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో చెక్‌డ్యామ్ కారణంగా కిలోమీటరు మేర విస్తీర్ణంలో భూగర్భ జలాలు పెరిగాయి. గతంలో కన్నా సాగు విస్తీర్ణం పెరిగింది.

- అయ్యపురెడ్డి, రైతు వడ్డెమాన్



చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి సమీపంలోని ఊకచెట్టవాగు వద్ద..

ప్రజలు, పోలీసుల బంధం బలపడాలి

- బెటాలియన్ డీఐజీ సిద్దీఖ్



మాట్లాడుతున్న బెటాలియన్స్ డీఐజీ సిద్దీఖ్ పక్కన కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రజలు, పోలీసుల మధ్య బంధం బలపడాలని రాష్ట్ర బెటాలియన్ డీఐజీ ఎంఎస్, సిద్దిక్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని సోమవారం పదో బెటాలియన్‌లో నిర్వహించిన పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి పటాలపు కమాండెంట్ సాంబయ్యతో కలిసి డీఐజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అమరులకు స్థూపం దగ్గర నివాళులర్పించి అమరుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. మనిషి ఎలాగైనా మరణం పొందుతారని అది దేశం కోసం ప్రాణాలర్పించడం వీరోచిత ప్రాణత్యాగం అని గుర్తు చేశారు. సమాజ భద్రత రక్షణల కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితమవ్వాలన్నారు. అమరులను స్మరించుకుంటూ సంస్మరణం జరుపుకుంటున్నామన్నారు. బెటాలియన్ ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నానన్నారు. అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ చౌహన్, ఆర్‌ఐలు వెంకటేశ్వర్లు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సుంకేసుల డ్యాంకు కొనసాగుతున్న వరద



సుంకేసుల డ్యాం నుంచి విడుదల అవుతున్న వరద నీరు

రాజోలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల డ్యాంకు వరద ప్రవాహం కొనసాగుతుంది. సోమవారం జలాశయానికి ఎగువ నుంచి 54 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో డ్యాం నందు 12 గేట్ల ద్వారా 51 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. డ్యాం నీటి సామర్థ్యం 1.20 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.990 టీఎంసీ నీరు ఉందని, డ్యాం గరిష్ఠ నీటిమట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.40 మీటర్లు నమోదు అయినట్లు ఆయన తెలిపారు.

జీహెచ్‌ఎంల సస్పెన్షన్‌తో ఉలికిపాటు

(మొదటిపేజీ తరువాయి)

అన్న దానిపై క్షుణ్ణంగా 14 నెలల పాటు పరిశీలించారు. అప్పట్లో జిల్లాలో మొత్తం 17 మంది జీహెచ్ ఎంలు తప్పు చేసినట్లు గుర్తించిన అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో పది మంది జీహెచ్‌ఎంలు నిబంధనలను అతిక్రమించి స్పౌజ్ పాయింట్లు తీసుకొని తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలను ఎంచుకొని బదిలీల్లో స్థానాలు తీసుకున్నారని విచారణలో తేలింది. పది మందిపై సస్పెన్షన్ వేటు వేస్తూ పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క సారిగా జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉలిక్కి పడ్డారు. సోమవారం దీనిపై ఉపాధ్యాయుల్లో చర్చ సాగింది. మొత్తంగా తప్పుచేసిన జీహెచ్ ఎంలపై వేటు పడటంతో ఉపాధ్యాయులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సరైన గుణపాఠం జరిగిందంటున్నారు.

● స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలపై కూడా చర్యలు తీసుకోవాలి

గత జూలైలో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల తప్పిదాలకు పాల్పడ్డారు. ఈ విషయంపై కూడా ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వచ్చాయి. అయితే జిల్లాలో మొత్తం తొమ్మిది మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి వీందర్ షోకాజ్ నోటీలు ఇచ్చారు. అయితే వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకో లేదు.

దీంతో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి, తప్పుచేసిన వీరిని సస్పెన్షన్ వేటు వేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా పీఆర్టీయూ టీఎస్, తపస్ నాయకులకు చెందిన వారు ఉన్నట్లు వారు ఆరోపి స్తున్నారు.

● హర్షవర్ధన్‌రెడ్డి ఇంటికి క్యూ కట్టిన జీహెచ్‌ఎంలు

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప ది మందిపై సస్పెన్షన్ వేటు పడటంతో జీ హెచ్‌ఎం సంఘం నాయకులు తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, పీసీసీ అధి కార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి ఇంటికి పలువు రు క్యూకట్టారు. తాము ఏదో తెలియక చేశామని, ఇంత జరుగుతుందని అనుకోలేదని, పాఠశాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడి త మకు న్యాయం చేయాలని వేడుకున్నట్లు స మాచారం.

అయితే సస్పెండ్ అయిన జీహెచ్ ఎంలకు పోస్టింగ్ ఇచ్చేందుకు కనీసం పదిహే ను రోజులైనా పట్టవచ్చని పలువురు చర్చించుకున్నారు.

ఇదిలా ఉంటే.. ఇకముందు స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పుడు సమాచారం ఇవ్వకుండా ఉండాలంటే ఇలాంటి చర్యలు ఉంటేనే మంచిదని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఆధ్యాత్మికం



శివపార్వతులను భక్తి శ్రద్ధలతో ఊరేగిస్తున్న భక్తులు

అచ్చంపేటఅర్బన్. అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం ఈశ్వరునికి ప్రీతి పాత్రమైన రోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాదు, రంగారెడ్డి, నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పాపనాశిని గుండంలో భక్తులు స్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు వేదపండితులు రామూర్తి, వీరయ్య, రాజశేఖర్, ఆనంద్ శర్మ, చంద్రశేఖర్‌లు .ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు కుంకుమార్చనలు చేశారు. అనంతరం సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు పల్లకిలో భజనలు, కీర్తనలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఉత్సవ మూర్తులకు గుండంలో చక్రస్నానాలు చేయించి పల్లకిలో ఆలయం వద్దకు తీసుకు వచ్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్లారు. ఆలయానికి దాదాపు ఆరు వందలమంది భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయ సిబ్బంది రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కవికుమార్, శంకర్, దామోదర్ ఉన్నారు.

పథకాల అమలుపై అవగాహన ఉండాలి

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో ప్రభుత్వ పథకాల అధ్యయనం, అమలు తీరుపై శిక్షణ అధికారులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అధ్యయనం, అమలు తీరుపై అవగాహన కలిగి ఉండాలని శిక్షణ అధికారులకు కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్స్టిట్యూట్ నుంచి జిల్లాకు వచ్చిన 25 మంది శిక్షణ అధికారులైన ఆల్ ఇండియా సర్వీసెస్(ఐఏఎస్), సెంట్రల్ సివిల్ సర్వీసెస్(సీసీఎస్) అధికారులతో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భౌగోళికస్థితి, నియోజకవర్గాలు, మండలాలు, పట్టు చీరలు, అలంపూర్ ఆలయం, ఇరిగేషన్ ప్రాజెక్టులు, చారిత్రక కోటల వంటి ముఖ్యాంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలు, చేపట్టే కార్యక్రమాలపై వివరించారు. 25 శిక్షణాదారుల కోసం ఐదు గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో వీరి కోసం అధికారులకు కేటాయించడం జరిగిందన్నారు. ధరూర్ మండలం ఉప్పేరు గ్రామం, మానవపాడు మండలం కలుగుంట్ల, ఇటిక్యాల మండలం కోదండాపుం, మల్దకల్ మండలం పెద్దతండా, ఉండవల్లి మండలం బస్వాపూర్ గ్రామంతో పాటు గద్వాల, అలంపూర్ మునిసిపాలిటీలకు కేటాయించడం జరిగిందన్నారు. శిక్షణకు వచ్చిన అధికారులంతా అక్టోబరు 21 నుంచి 28 వరకు నిర్దేశించిన షెడ్యూల్‌కు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, ట్రైనీ అధికారులు ఉన్నారు.

న్యాయం చేయాలి

- ఫేక్ వీలునామాతో వోఆర్‌సీ పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న బాధితులు

గద్వాల క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గద్వాల పట్టణంలోని సర్వే నంబరు 895, 900లలో ఉన్న 11-20 ఎకరాల పొలాన్ని ఫేక్ వీలునామాతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మహమ్మద్, సుభాన్ మాట్లాడుతూ.. మా పేర్లపై విడివిడిగా ఉన్న భూమి మాకు వంశపారంపర్యంగా సంక్రమించిందని, కాస్తులోనూ తామే ఉన్నామన్నారు. ఈ భూమిని కొందరు రాజకీయ పలుబడితో చట్టవిరుద్ధంగా వోఆర్‌సీని పొంది ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఈ విషయంపై గద్వాల ఆర్డీవో, తహసీల్దార్ తీవ్ర అన్యాయం చేసారని, తమకు న్యాయం చేయాలని, లేదనంటే ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో తొమ్మిది మేకలు మృతి

వెల్దండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో చంద్రమౌళికి చెందిన తొమ్మిది మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలో చంద్రమౌళి వ్యవసాయ పొలంవద్ద ఏర్పాటు చేసిన షెడ్డులో మేకలు ఉండగా ఆదివారం రాత్రి అడవిజంతువు దాడిలో తొమ్మిది మేకలు మృతి చెందాయి. ఉదయం పొలం వద్దకు వెళ్లిన చంద్రమౌళి చనిపోయిన మేకలను చూసి స్థానికుల సహకారంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజ్ అధికారి కురుమంతి, బీట్ అధికారి లలితలు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. నక్కదాడిచేసి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. మృతిచెందిన మేకల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఢిల్లీ నుంచి కేరళకు వెళ్తున్న ఓ కారు పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న స్కూల్ బస్సును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ముగ్గురుకి స్వల్ప గాయలయ్యాయి. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. బస్సులో ఉన్న విద్యార్థులకు గాయాలు కానప్పటికీ భయంభ్రాంతులకు గురయ్యారు.

సైజ్ తగ్గిన చేప పిల్లలు

- ఇంత తక్కువ సైజ్ ఉంటే పెరిగేదెలా
- ఫిషరీస్ అధికారితో మత్స్యకారుల వాగ్వివాదం
- ఇష్టం ఉంటే తీసుకెళ్లండి లేదంటే వదిలేయాలంటున్న అధికారులు
- కాంట్రాక్టర్‌కు వంతపాడుతున్నారని లబ్ధిదారుల ఆరోపణలు



సంగాల చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే

గద్వాల, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిలో భాగంగా చేపపిల్లల పంపిణీ జిల్లాలో పరిహాసంగా మారింది. కాంట్రాక్టర్ చెప్పిందే వేదంగా మారడంతో సోమవారం మత్స్యకారులు ఫిషరీస్ అధికారితో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఆ అధికారి మీకు నచ్చితే తీసుకెళ్లండి లేదంటే వదిలేయండి అంటూ తేల్చిచెప్పడంతో వచ్చిన చేపపిల్లలను వాపసు పంపలేక మత్స్యకారులు తీసుకెళ్లారు. జిల్లాలో 1.69కోట్ల చేపపిల్లను సరఫరా చేయడానికి రెండు నెలల క్రితం టెండర్లను పిలిచారు. ముగ్గురు కాంట్రాక్టర్లు రాగా నాలుగేళ్లుగా సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌కే మళ్లీ కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీని సగానికి తగ్గించి 91లక్షల చేపపిల్ల పంపిణీకి అగ్రిమెంటు చేసింది. ఈ నెల నుంచి సరఫరా ప్రారంభం అయ్యింది. మొదటిరోజే చేపపిల్లల సైజుపై మత్స్యకారులు అభ్యంతరం తెలిపారు. ఇదివరకు 80 వేల చేపపిల్లలే రావడంతో వాపసు పంపలేక సంగాల చెరువులో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వదిలారు.

ఆ తర్వాత 6.60 లక్షల చేపపిల్లలను సరఫరా చేశారు. అందులో సైజు బాగానే ఉన్నాయని మత్స్యకారులు తెలిపారు. కానీ సోమవారం 35-40 ఎంఎం చేపపిల్లలు పూర్తిగా చిన్నవిగా ఉండటంతో మత్స్యకారులతో వాగ్వివాదానికి దిగారు. ఇప్పటికే పంపిణీ ఆలస్యం అయ్యిందని, ఇప్పుడు ఇంత చిన్న చేపపిల్లలను తీసుకెళితే ఎప్పుడు పెరుగుతాయని వారు ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను హెచ్చరించాల్సిన అధికారి కాంట్రాక్టర్‌ను ఎలా వెనుకేసుకొస్తారని నిలదీశారు.

జిల్లాలో చేపపిల్లల పంపిణీ ఇలా

జిల్లాలో నీటి వనరులను మూడు భాగాలుగా విభజించారు. అందులో చెరువులు, కుంటలు 411 ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది 21లక్షల (35ఎంఎం నుంచి 40ఎంఎం) చేప పిల్లలను వదలాలని లక్ష్యం పెట్టుకున్నారు. అదేవిధంగా ఆరు నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. అందులో 20లక్షల (80ఎంఎం నుంచి 100ఎంఎం) చేపపిల్లలను వదలనున్నారు. ఇవి కాకుండా నెట్టంపాడు ప్రాజెక్టు కింద గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు, సంగాల, తాటికుంట, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లతో పాటు జూరాల కింద జములమ్మ రిజర్వాయర్, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లలో 50లక్షల (80ఎంఎం నుంచి 100ఎంఎం) చేపపిల్లలను విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. బొచ్చ, మిడిగాల, బంగారుతీగ, రొయ్యలు తదితర రకాల చేపపిల్లలను నీటి వనరులను బట్టి వదలడానికి మత్స్యశాఖ అన్నిఏర్పాట్లు చేసింది.

చిన్న చేప పిల్లలు ఇస్తే ఎలా..?



చేప పిల్లల సైజు చాలా తక్కువగా ఉంది. దీనిని ప్రశ్నిస్తే అధికారులు ఇష్టం ఉంటే తీసుకెళ్లండి లేదంటే వాపసు పంపుతామంటున్నారు. చేసేదిలేక తీసుకెళుతున్నాం. ఉచిత చేపపిల్లల పంపిణీ మత్స్యకారుల అభివృద్ధికి కాదు కాంట్రాక్టర్ లాభపడటానికే అన్నట్లుంది.

- రాఘువేంద్ర, మత్స్యకారుడు నందిన్నె

ఒకరకం చేపపిల్లలు చిన్నవిగా ఉన్నాయి



ఈ రోజు పంపిణీ చేసిన చేపపిల్లల్లో బంగారుతీగ అనే రకం చేపపిల్లలు మాత్రమే సైజు చిన్నవిగా ఉన్నాయి. కాంట్రాక్టర్ ముందే ఫోన్‌చేసి చెప్పాడు. ఆలస్యమవుతోందని నేనే తీసుకురమని చెప్పాను. మిగిలిన చేపపిల్లలు నిబంధనల ప్రకారమే ఉన్నాయి.

- షకీలాభాను, జిల్లా మత్స్యశాఖ అధికారి గద్వాల



కవర్లలో తీసుకువచ్చిన చేపపిల్లలు



సైజ్ చిన్నగా ఉన్న చేపపిల్లలు

ట్రాఫిక్ జాం



మహబూబ్‌నగర్ బస్టాండ్ వద్ద వాహనాల రద్దీ

ఈడ బండి నడిపితే.. ఏడైనా నడుపొచ్చు...

మహబూబ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు రోడ్లపై వాహనాన్ని సవ్యంగా నడుపగలిగితే.. ఇంక ఎక్కడైనా హాయిగా నడుప వచ్చని ఇక్కడి వాహనదారులు చెప్తుంటారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. రాష్ట్రంలోని పెద్ద పట్టణాల్లో పాలమూరు పట్టణం ఒకటి. ఇక్కడ మూడు లక్షల మంది జనాభా ఉండగా, చుట్టు పక్క గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది వచ్చి పోతుంటారు. దీంతో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇంత పెద్ద పట్టణానికి ప్రధాన రహదారి ఒక్కటే ఉండటంతో ట్రాఫిక్ సమస్య చికాకు తెప్పిస్తోంది.. ఉదయం ఎనిమిది గంటల నుంచి పాఠశాలల హడావిడి మొదలవుతుంది. ఆ సమయంలో విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రహదారులపై రద్దీ ప్రారంభం అవుతుంది. 8.30 నుంచి 9.30 గంటల మధ్య ఆఫీసులకు వెళ్ళే వారు, వ్యాపారులు రోడ్లపైకి వస్తుంటారు. దీంతో ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోతాయి. దీంతో తరుచూ రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు మళ్లీ ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో కొన్ని వీధుల్లో తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రధాన రహదా రితో పాటు న్యూటౌన్ నుంచి షాషాబ్‌గుట్ట రహదారి, న్యూటౌన్ నుంచి శెట్టి కాంప్లెక్స్, అశోక్ టాకీస్ చౌరస్తా నుంచి గడియారం చౌరస్తా, పాత బస్టాండ్ నుంచి తెలంగాణ చౌరస్తా, గడియారం చౌరస్తా నుంచి రాంమందిర్ చౌరస్తాలు రద్దీగా మారుతున్నాయి. పట్టణంలో మాల్స్, వ్యాపార, వాణిజ్య సముదాయాలు పెరగడంతోపాటు జనం, వాహనాల సంఖ్య కూడా ఎక్కువ అవడంతో రహదారిని విస్తరించినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటేనే సమస్య పరిష్కారం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అలాగే అప్పన్న పల్లి నుంచి బండమీదిపల్లి వరకు దాదాపు 12 కిలోమీటర్ల మేర ఉన్న ఏకైక ప్రధాన రహదారి వెంట వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయి. వాటిల్లో షాపింగ్ వచ్చి పోయే వారితో రోడ్లపై రద్దీ విపరీతం అవుతోంది. పట్టణంలో దాదాపు ఏడు వేలకు పైగా ఆటోలు, వందల సంఖ్యలో స్కూల్ బస్సులు, గూడ్స్ వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతూనే ఉంది.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో అవస్థలు

ప్రధాన రహదారిపై పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను నిర్మించి బారికేడ్‌లను కూడా ఏర్పాటు చేశారు. కానీ వాటిని చిరు వ్యాపారులు ఆక్రమించారు. కొందరు దుకాణాల బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. దీనికి తోడు సుందరీకరణలో భాగంగా ఫుట్‌పాత్‌లపై భారీ పూల తొట్లను ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు రోడ్లపైనే నడవాల్సి వస్తోంది. అయితే ఆ తొట్లలో చాలా వరకు మొక్కలు ఎండిపోయాయి. దీంతో అవి కొన్ని చోట్ల ఉమ్మితొట్లుగా మారిపోయాయి. అలాగే దుకాణాల్లో కొనుగోలు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ప్రధాన రహదారితో పాటు, గడియారం చౌరస్తాలో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

పని చేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లను రహదారి విస్తరణ సమయంలో తొలగించారు. గత ఎన్నికల ముందు పలు కూడళ్లలో వాటిని మళ్లీ ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాల్సి ఉంది. నియమ నిబంధనలు సక్రమంగా పాటించేలా చర్యలు తీసుకుంటే టౌన్‌లో ట్రాఫిక్ వ్యవస్థ గాడిన పడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడ్తున్నారు.


మహబూబ్‌నగర్‌లోని మెట్టుగడ్డ చౌరస్తా


షా సాహెబ్ గుట్ట వద్ద అస్తవ్యస్తంగా ట్రాఫిక్


అచ్చంపేటలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని అంబేద్కర్ చౌరస్తా

పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

అచ్చంపేట (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా ఉండటం లేదు. షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కొనుగోలుదారులు రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. లింగాల, బల్మూర్, ఉప్పునుంతల మండలాల ప్రజలు అంబేద్కర్ కూడలి మీదుగానే పట్టణంలోకి వస్తారు. దీంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు కూడా ఆ చౌరస్తాలోనే జరుగుతుండటంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చౌరస్తా పక్కనే ఉన్న పోస్ట్ ఆఫీసు పరిసరాల్లో రోడ్లపైనే చిరు వ్యాపారాలు కొనసాగుతుండటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాతబ జారులో ఒక కానిస్టేబుల్‌ను నియమించినప్పటికీ తరుచూ రాకపోకలకు ఆటంకం కలుగుతూనే ఉంటుంది.


అచ్చంపేటలోని ఎస్‌బీఐ వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

వాహనాల రాకపోకలకు ఇక్కట్లు

నాగర్‌కర్నూల్ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోవడం సమస్యగా మారింది. పది మంది రెగ్యులర్ సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణను కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో పట్టణంలోని నల్లవెల్లి, నాగనూల్, శ్రీపురం చౌరస్తాల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రవితేజ స్కూల్ ముందు రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. నల్లవెల్లి రోడ్డులో డివైడర్ వెడల్పు ఎక్కువగా ఉండటం కూడా సమస్యగా మారింది. నల్లవెల్లి రోడ్డు, శ్రీపురం చౌరస్తా, నాగనూల్ రోడ్లల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది.


కొల్లాపూర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన చౌరస్తా

ట్రాఫిక్ సిగ్నల్స్ లేక అగచాట్లు

కొల్లాపూర్ (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం సమస్యగా మారింది. ట్రాఫిక్ పోలీసులు కూడా లేరు. దీంతో పట్టణంలోని ఎన్‌టీఆర్, బాబుజగ్జీవన్‌రావ్, అంబేడ్కర్ చౌరస్తాల్లో తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు కూడా ఇబ్బంది అవుతోంది. ఇక్కడ ప్రైవేట్ వాహనాలు, జీపులను రోడ్డుపై నిలిపి ఉంచడంతో సమస్య ఎదురవుతోంది. ఆర్టీసీ బస్టాండ్ ముందు రోడ్డు కిరువైపులా చిరు వ్యాపారాలు కొనసాగుతుండటం, వాటి ముందు రోడ్డుపై వాహనాలను నిలుపుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అలాగే బండాయిగుట్టకు వెళ్లే రోడ్డుపై ప్రైవేట్ వాహనాలను నిలుపుతుండటం సమస్యగా మారింది. ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్ పోలీసులను నియమించాల్సి ఉంది. అలాగే పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.


కల్వకుర్తిలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో రోడ్డు పక్కనే పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

సెల్లార్లలో వ్యాపారాలు..

కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని దుకాణ సముదాయాలకు సంబంధించిన సెల్లార్లను ఇతర వాణిజ్య అవసరాలకు వాడుకుంటున్నారు. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తరుచూ ఆటంకం కలుగుతోంది. పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో కూడా దుకాణాలు, ఎస్‌బీఐ బ్యాంకు ముందు రోడ్డు పక్కనే ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్ అందుబాటులో ఉంటున్నారు. కానీ రోడ్ల అంచునే చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న డబ్బాలు, దుకాణాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

చౌరస్తా.. రాకపోకలకు చింత

భూత్పూర్ (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు రద్దీగా ఉండే భూత్పూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కర్నూల్, హైదరాబాద్, శ్రీశైలం, రాయచూరు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఈ కూడలి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి తోడు ప్రతీ ఆదివారం ఇక్కడ జరిగే సంత సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. వాహనాలను ఎక్కడ పడితే అక్కడే నిలపడం సమస్యగా మారింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టు మూతపడింది. సంత రోజు వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగినప్పుడు వెళ్లి సమస్యను పరిష్కరిస్తున్నారు.


భూత్పూర్ చౌరస్తాలో వాహనాల రద్దీ


జడ్చర్ల ఫ్లై ఓవర్ వద్ద జాం అయిన ట్రాఫిక్

ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్

జడ్చర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ఆయా పరిశ్రమలు ఏర్పాటు చేసిన వాహనాల్లో వెళ్తూ ఉంటారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ వాహనాలను జడ్చర్ల క్రాస్‌రోడ్డు (ఫ్లైఓవర్), అంబేడ్కర్ చౌరస్తా, ఇందిరమ్మచౌరస్తా, నేతాజీ చౌరస్తాల్లో నిలుపుతుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎల్ఐసీ కార్యాలయం నుంచి సిగ్నల్‌గడ్డ మీదుగా కల్వకుర్తి వెళ్లే దారిలోని సాయినగర్‌కాలనీ వరకు 167వ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుండడంతో వాహనాల రాకపోకలకు తరుచూ ఇబ్బంది అవుతోంది. క్రాస్‌రోడ్డు, సిగ్నల్‌గడ్డ, నేతాజీ చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే జడ్చర్ల క్రాస్‌రోడ్డు, సిగ్నల్‌గడ్డ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధుల్లో ఉంటున్నారు. అయినా తరుచూ సమస్య ఏర్పడుతోంది.


గద్వాల కొత్తబస్టాండ్ ఎదురుగా రోడ్డు పక్కన నిలిపి ఉన్న బైక్‌లు

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

గద్వాల క్రైం (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దుకాణాల ముందు, కూడళ్లలో వాహనాలపై రోడ్డుపైనే నిలుపుతుండటంతో రాకపోకలకు తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఆదివారం ప్రారంభించారు. దీంతో కొంత మేర సమస్య పరిష్కారం అయ్యింది. అయితే ఆయా కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.


కృష్ణవేణి చౌరస్తాలో ఆదివారం ప్రారంభించిన ట్రాఫిక్ సిగ్నల్స్

ప్రయాణికులకు తప్పని ఇబ్బంది

అయిజ (ఆంధ్రజ్యోతి) : అయిజలో పట్టణంలోని పాత బస్టాండు, అంబేడ్కర్ చౌక్, కొత్త బస్టాండు, చౌరస్తా, మంత్రాలయం చౌరస్తాల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఆయా ప్రాంతాల్లో వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలుపుతుండటం సమస్యగా మారింది. కొత్త బస్టాండు లోపల నుంచి బస్సులు బయటకు రావడం కూడా కష్టమవుతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రస్తుతం మూతపడి ఉంటోంది. పోలీసులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై బీజేపీ నాయకులు భగత్, వెంకటేష్, రఘు సోమవారం అయిజ ఎస్ఐ విజయభాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు.


వనపర్తి రాజీవ్ చౌరస్తాలో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

వనపర్తి క్రైమ్ (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. అక్కడ ట్రాఫిక్ పోలీసును కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి నిత్యం ఇబ్బందులు ఎదురవు తున్నాయి. కొత్త బస్టాండ్ నుంచి కొత్తకోట వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఇక్కడ రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. అలాగే పట్టణంలోని దుకాణాల ముందు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటం ఇబ్బందిగా మారింది. కొత్త బస్టాండ్, రాజీవ్‌చౌరస్తా, వివేకానంద చౌరస్తా, గాంధీ చౌక్, అంబేడ్కర్ చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో నిలిచిపోయిన ట్రాఫిక్

రహదారి విస్తరణ అవసరం

ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణంలో రోడ్డు విస్తరణ చేపట్టకముందే డివైడర్లు ఏర్పాటు చేయడంతో తరుచూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. దీనికి తోడు భారీ వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. రోడ్ల విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకున్నా పనులు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది. అలాగే దుకాణ సముదాయా ముందు రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటం సమస్యగా మారింది. ఆదివారం సంత రోజు ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం అవుతోంది.


కోస్గిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని శివాజీ కూడలి

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

కోస్గి (ఆంధ్రజ్యోతి) : కోస్గి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. కూడళ్ల వద్ద పోలీసులు కూడా ఉండటం లేదు. దీంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. శివాజీ, రామాలయం కూడళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారాలు కొనసాగడం సమస్యగా మారింది. ఆదివారం కూరగాయల సంత రోడ్డుపైనే నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది.


బస్టాండ్ ముందు రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

ఎక్కడపడితే అక్కడ పార్కింగ్

మక్తల్ (ఆంధ్రజ్యోతి) : మక్తల్ మునిసిపాలిటీలోని బస్టాండ్, ఆంజనేయ స్వామి ఆలయం, శివాజీమార్గ్, పాత రహదారులపై వాహనాలు ఎక్కడపడితే ఎక్కడ నిలుపుతున్నారు. అలాగే అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆజాద్‌నగర్ వరకు రహదారికి ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఇక్కడ ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేయాలని, రాకపోకలకు ఆటంకం కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలు అస్తవ్యస్తం

నారాయణపేట (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. సివిల్‌లైన్ మీదుగా ర్యాలీ వస్తుండగా, ఓ హోటల్ ముందు చౌరస్తా వద్ద ఓ ఆటో, ఓ కారు రోడ్డుపైనే పార్క్ చేసి ఉండటం గమనార్హం. ఆ తర్వాత ఒక ఒక ట్రాన్స్‌పోర్టు డీసీఎంను కూడా రోడ్డుపైనే ఆపి సామగ్రిని దించుకున్నారు. ఈ సందర్భంగా రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. అలాగే పాత బస్టాండ్, వీర సావర్కర్ చౌరస్తాలో దామరగిద్ద, యనగుంది, మద్దూర్ తదితర ప్రాతాలకు వెళ్లే అటోలు రోడ్ల పైన ఆగి ఉంటున్నాయి. సత్యనారాయణ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నళ్లు కొంత కాలంగా పనిచేయడం లేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే సెంటర్ చౌక్, బజార్ చౌక్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉండటం లేదు.

సరాఫ్ బజార్‌లో రహదారి ఇరుకుగా ఉంటుంది. దీనికి తోడు బంగారు, వెండి, వస్త్ర దుకాణాల ముందు కొనుగోలుదారులు వాహనాలను నిలుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు.


నారాయణపేట సత్యనారాయణ చౌరస్తాలో రోడ్డుపై నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలు


పేట వీరసావర్కర్ చౌరస్తాలో ర్యాలీగా వస్తున్న పోలీసులు, రోడ్డుపైనే ఆటో ఆపి సామగ్రి దించుతున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఓటుపై ఓటర్లకు అవగాహన

- రేవల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి



రేవల్లి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రజలకు ఓటు పై అవగాహన కోసం అనేక కార్యక్రమాలు చేబడుతున్నామని, ఓటరు లిస్టులో నుంచి చనిపోయిన వారిని తొలగిస్తున్నామని, అదేవిధంగా, 18 సంవత్సరాలు నిం డిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆంధ్రజ్యోతికి రేవల్లి మండల తహసీల్దార్ లక్ష్మీదేవి సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

మండలంలో సమస్యలు ఏవి?

ధరణి పోర్టల్‌లో రైతుల వివరాలు, వారి భూమి వివరాలు తప్పుగా నమోదయ్యాయని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు.

మండలంలో ఏయే గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి?

మండల కేంద్రం రేవల్లితో పాటు, నాగపూర్, తల్పునూర్‌లో ఈ భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి.

భూమి రిజిస్ట్రేషన్లు రోజుకు ఎన్ని జరుగుతున్నాయి?

ప్రతీ రోజు రెండు నుంచి మూడు భూమి రిజిస్ట్రేషన్లు వస్తున్నాయి.

ఇసుక మాఫియా కొనసాగుతుందా ?

మండలంలో అంతగా లేనప్పటికీ, ఇతర మండలాల నుంచి ఇసుక రేవల్లి మీదుగా తరలిస్తున్నారు. వాటిపై రెండు కేసులు నమోదు చేశాం.

నూతనంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారా ?

ఒక్కొక్క పోలింగ్ బూత్‌లో 1500 ఓటర్లు దాటితే అదనంగా మరొక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం.

పాఠశాలల పరిశీలన

పాన్‌గల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన సమయంలో ఎంఈవో బిక్షీ నివాసులు సందర్శించి ప్రార్థన చేయించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అదే విధంగా కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థులు రాస్తున్న ఎస్‌ఏ -1 పరీక్షలను పరిశీలించారు. సీఆర్పీ గోవింద నాయక్, కస్తూర్బా ప్రత్యేకాధికారిణి హేమలత, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పాన్‌గల్ మండల పశువైద్యాధికారిగా సురేష్

పాన్‌గల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పశు వైద్యాధికారిగా సురేష్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్యామ్ పెద్దమందడి మండలానికి బదిలీ కావడంతో ప్రభుత్వం ఇటీవల నూతనంగా చేపట్టిన ఉద్యోగ నియామకంలో నూతనంగా ఎంపికై మండలానికి కేటాయించడంతో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాధవరావుపల్లి, చిక్కేపల్లి, రాయినిపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ అవినీతి అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోకుండా కాపాడుతున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అధికారులపై మండిపడ్డారు. సోమవారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్ ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ కుమార్ నాలుగు నెలల నుంచి విధులకు హాజరు కాకుండా, హాజరు రిజి స్టర్ ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సం తకాలు చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్ర మంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు బడేసాబ్, రాఘవేందర్ గౌడ్, మ్యాదరిరాజు, సాయిబాబా పాల్గొన్నారు.

వరి కొనుగోలుపై అవగాహన

గోపాల్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతు వేదికలో వాన కాలంలో వరి కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ నాగరాజు మాట్లాడుతూ... వరి కొనుగోలు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సన్న రకం వడ్లను గుర్తించేందుకు వాడే డయల్ మైక్రో మీటర్‌ను వివరించారు.

చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలను వదులుతున్న అధికారులు

ఖిల్లాఘణపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూతను అందించడానికి సిద్ధంగా ఉందని మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ భరత్ తెలిపారు. మండలంలోని కమలొద్దిన్‌పూర్, సోలీపూర్, మానాజీపేటలో మత్స్యకారులకు సోమవారం మత్స్యశాఖ అధికారులు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. వీరేష్, ఫిషర్ మెన్‌లు రాజు, రవి మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

వనపర్తి టౌన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : బుజ్జగింపు చర్యలు కాకుండా తక్షణమే పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని బీఎస్ఎఫ్ (బహుజన స్టూడెంట్ ఫెడరేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోలు రాము డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు.

సాగు నీటి కష్టాలు తీరేనా?

- సాగు నీరు రాని డీ 4 కాల్వ
- రెండు నెలల కిందట తెగిన కాల్వ
- సొంత డబ్బులతో పైపులైన్లు ఏర్పాటు

రేవల్లి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగు నీరు అందిస్తున్నామని అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, నేటికీ కొన్ని గ్రామాల్లో వందల ఎకరాలకు సాగు నీరు అందటం లేదు. గుడిపల్లి మరియు ఏదుల రిజర్వాయర్ నుంచి పది కిలోమీటర్ల దూరం కూడా లేని, రేవల్లి మండలంలోని చాలా గ్రామాల్లో శిస్తు చేస్తున్న పొలాలకు నేటికీ సాగు నీరు అందడం లేదు.

కాల్వలు లేని తండా...

రేవల్లి మండలంలోని పాత తండా గ్రామ పంచాయతీకి చెందిన తల్పునూర్ తండాకు నేటి వరకు సాగునీటి కాల్వనే లేదు. 2వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు తమ సొంత డబ్బులతో మోటార్లు కొనుక్కొని పైపులైన్లు వేసుకుని వ్యవసాయం చేస్తున్నారు.

- డీ 8 కాల్వకు అనుసంధానంగా ఉన్న డీ4 కాల్వ పనులు నేటికీ పూర్తికాలేదు, తల్పునూర్ గ్రామ శివారు కాల్వలో గుండ్లు, బండలు ఉండటంతో నీరు కాల్వ చివరి వరకు చేరడంలేదు. తల్పునూర్ గ్రామ శివారులో 100 ఎకరాల శిస్తుకు సాగునీరు అందడంలేదు. గ్రామస్థులంతా డీ6 కాల్వ వెంట వచ్చేనీటిని వాగులోకి మలుపుకొని చెరువును నింపుకొంటున్నారు. అందుకయ్యే ఖర్చంతా రైతులందరూ ఎకారాల లెక్కన డబ్బు పోగు చేసుకుని వాగుకు మరమ్మతు చేసుకున్నారు.



సాగు నీరు రాక అసంపూర్తిగా వదిలేసిన డీ4 కాల్వ

బ్రిడ్జిలు నిర్మించలేదు..

రేవల్లి, తల్పునూర్ రహదారిపై డీ 5 కాల్వ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. అదే విధంగా డీ 4 కాల్వ పై తల్పునూర్ తూడుకుర్తి పొలిమెర బాటపై కూడా బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. డీ6 కాల్వ తల్పునూర్‌లోని ఇళ్ల మధ్య వెంట వెళ్లింది. అక్కడ కూడా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పైపులైన్లు ఏర్పాటు చేసుకున్నాం..



డీ4 కాల్వ తీసి పది సంవత్సరాలు దాటినా... నేటి వరకు పూర్తి స్థాయిలో కాల్వ వెంట నీరు రాలేదు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదులు చేసినా లాభం లేకుండా పోయింది.

- గోపాల్ రైతు, తల్పునూర్

వానాకాలం వరకు పూర్తి కావొచ్చు..



డీ 4, డీ 5 కాల్వ పనులు వచ్చే వానాకాలం సీజన్ వరకు పూర్తి కావొచ్చు, అదేవిధంగా అదే విధంగా డీ 5 కాల్వ తెగిన వద్ద మరమ్మతులు చేపడుతాం.

- వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈ, వనపర్తి

సమాజ భద్రతకు పోలీసుల సేవలు వెలకట్టలేనివి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- ఎస్పీ రావుల గిరిధర్
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



ఎస్పీ కార్యాలయంలో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ గిరిధర్, అడిషనల్ ఎస్పీ

వనపర్తి క్రైమ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజ భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన పోలీస్ సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట కలెక్టర్, ఎస్పీ పోలీసు అధికారులు అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజల భద్రత కోసం వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. దేశ భద్రత కోసం దేశ సరిహద్దుల్లో సైన్యం ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపలా కాస్తుంటే అంతర్గతంగా దేశంలో పోలీసులు శాంతిభద్రతలు కాపాడుతున్నారని కొనియాడారు. గత ఏడాది శాంతి భద్రతలు కాపాడుతూ దాదాపు 250 కి పైగా పోలీసులు ప్రాణాలు కోల్పోయారని వారందరికీ నేడు శ్రద్ధాంజలి ఘటిస్తూ.. నివాళులు అర్పించామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ, రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అదనపు ఎస్పీ రామదాసు తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఆర్ అదనపు డీఎస్పీ వీరారెడ్డి, సీఐలు నాగభూషణరావు, రాంబాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, శ్రీనివాస్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



ఆత్మకూరు ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో విశ్వ బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో పోలీసుల విధి నిర్వహణలో అమరులైన చిత్రపటాలకు పూలమాలలు వేసి సోమవారం నివాళి అర్పించారు.

ఆత్మకూరు : పట్టణ కేంద్రంలోని పోలీసులు పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు.

మదనాపురం : అమ రవీరుల స్తూపం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

వనపర్తి వైద్య విభాగం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నూతన భారతీయ జన ఔషధ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలకు ప్రైవేటు కంపెనీల ధరల కన్నా సగం ధరలకే ఔషధాలను (మందులను) ఔషధీ కేంద్రాల్లో లభిస్తాయన్నారు. ప్రజలు ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అవుట్ పేషెంట్ వార్డు, టీబీ ఆరోగ్య శ్రీ రెడ్‌క్రాస్ సొసైటీ విభాగాల్లో హాజరు పట్టికలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో శుభ్రత పాటించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, కదిరె రాములు, ఎండి బాబా, చరణ్, డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



షాపూర్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

ఖిల్లాఘణపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని షాపూర్, అల్లమాయపల్లి, రోడ్డు మీద తండా ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఎస్‌ఏ 1 (సమ్మేటివ్ అసైన్‌మెంట్) పరీక్షల నిర్వహణను మండల విద్యాధికారి జయశంకర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష పత్రాలను విద్యార్థుల సామర్థ్యాలను ఎంఈవో జయశంకర్ పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తకోట విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గణేష్ నా యక్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎం పికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి వేకానంద తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అండర్ 14 వాలీబాల్ జోన ల్ స్థాయి ఎంపిక పోటీల్లో గణేష్ నాయక్ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు జోనల్ పోటీలకు అర్హత సాధించడంతో సోమవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి గణేష్ నాయక్‌ను అభినందించారు. అభినందించిన వారిలో ఎంఈవో కృష్ణయ్య వెంకటేష్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

కమిషనర్‌కు నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు 10 శాతం ల్యాం డ్‌లు కబ్జాకు గురయ్యాయని ఆరో పిస్తూ.. ఆత్మకూరు మం డల కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో మునిసిపల్ కమిష నర్ శశిధర్‌కు సోమవారం వినతి అందజేశారు. ఆత్మకూరు మునిసిపాలిటీ కేంద్ర ంగా ఏర్పడిన అనంతరం తీవ్రస్థాయిలో పట్టణంలో ప్రభుత్వ స్థలాలు 10 శాతం భూములు ఆక్రమణకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ పక్కనే ఉన్న వెంచర్‌లో 10 శాతం ల్యాండ్ ఆక్రమణకు గురి చేసి ప్రహరీ నిర్మించినా... మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. గంగాధర్ గౌడ్, గంగాధర్, మణివర్ధన్, రఫిక్ పాల్గొన్నారు.

అమరచింత : అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

భకిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కొత్తకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయనిపేట తండాలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు భక్తిశ్రద్ధలతో సోమవారం కొన సాగాయి. ప్రతిష్ఠాపన అనంతరం తండావాసులతో పాటు బీఆర్ఎస్ నాయ కులు ఆంజనేయస్వామి, ధ్వజస్తంభం, బొడ్రాయిలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజలకు హాజరైన నాయకులను తండావాసులు ఆలయ కండువాలతో సన్మానం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. విశ్వేశ్వర్, వామన్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించం

పెబ్బేరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధారమైన ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పెబ్బేరు మునిసిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనం రాములు, నాయకులు పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం పెబ్బేరు విలేకరులతో మాట్లాడారు. పెబ్బేరు సంత స్థలం విషయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి నిర్లక్ష్యంతో నేడు సంత స్థలాన్ని కోల్పోవడం జరిగిందన్నారు. పెబ్బేరు సంత గురించి మంత్రి పూజారులతో 12 ఎకరాలు కండిషన్‌పై అగ్రిమెంట్ చేస్తే దానిని అమలు ఎమ్మెల్యే చేయకపోవ డంతో పూజారులు హైకోర్టుకు వెళ్లి మళ్లీ వారి భూమి వారు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పూర్తి బాధ్యత నిర్లక్ష్యం ఎమ్మెల్యేదే అన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదల అభివృద్ధి

పెబ్బేరు రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పేదలు అభివృద్ధి చెందడం జరుగుతుందని అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని శాఖాపురం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. బీజేపీ పార్టీని సంస్థాగత అభివృద్ధి చేయడం కోసం కృ షి చేయాలన్నారు. రాఘవేంద్ర, నారాయణ, రఘు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిలో సభ్యత్వ నమోదు

వనపర్తి రూరల్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తుంటే బీజేపీకి అపూర్వ స్పందన లభిస్తుందని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని చిమనగుంటపల్లిలో గడప గడపకు తిరిగి ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతీ ఒక్క పేద కుటుంబానికి అన్ని రకాల సదుపాయాలు, మౌలిక వసతులు కల్పిస్తారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నామని అన్నారు. చిన్నయ్య, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం చూపాలి



ఫిర్యాదులు వింటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్‌తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాల్య వివాహాలను అరికట్టడంలో భాగంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, నూతన పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన మెగా అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీపై విస్తృతంగా రుణ సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ యువతకు సరైన అవగాహన లేకపోవడంతో ఆశించిన స్థాయిలో గ్రౌండింగ్ కాలేకపోతున్నాయని అన్నారు. సదస్సులో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే ఔత్సాహికులకు, శిక్షణ మొదలు రుణ సౌకర్యం అనుమతులు పొందేందుకు మార్కెటింగ్ ఎలా చేసుకోవాలి అనే విషయాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక రోజు అవగాహన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్ విడుదల

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ 50 వసంతాల సభను జయప్రదం చేయాలని వనపర్తి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. అనంత రం మాట్లాడారు. ఈ నెల 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ 50 వసంతాల సభను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, మేధావులు అత్యధికంగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. మోహిన్ అలీ, సందీప్, రేవతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ కాలేజీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ కళాశాలలో 300 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తరగతి గదుల సంఖ్య తక్కువగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ప్రహరీ లేని కారణంగా విష సర్పాలు కాలేజీ ఆవరణలోకి వస్తున్నాయని, తక్షణమే ప్రహరీ నిర్మించాలని కోరారు. అదనపు గదులను మొదటి ఫ్లోర్‌లో నిర్మించిన వాటికి మెట్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే కనీసం తాగడానికి కూడా నీళ్లు లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా నాభి శిల వార్షికోత్సవం



ఖిల్లాఘణపురంలో నాభి శిలకు ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్థులు

ఖిల్లాఘణపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రావి చెట్టు దగ్గర, కుమ్మరిగేరి ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ప్రతిష్ఠించిన నాభి శిల (బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుడు) నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మాజీ సర్పంచ్ క్యామ వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో నాభి శిలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో గణపురం, ఆన్‌పాడ్ శివార్లలో ప్రతిష్ఠించిన రెండు బొడ్రాయిలకు వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. క్యామ వెంకటరమణ, బెస్త గోపాల్, జోషి శ్రీనివాస్ శర్మ, లింగస్వామి, శివశంకర్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : మండల పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమా లు నిర్వహించారు. ఈ సందర్భంగా పునర్నిర్మాణంలో భాగంగా అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని జల నివాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో వేదమంత్రాల మధ్య జల నివాస కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటాపురం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



బుసిరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న గ్రామ కార్యదర్శి కృష్ణమ్మ

పాన్‌గల్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లిలో సోమవారం బాల్య వివాహాలను అరికట్టాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణమ్మ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో ప్రతీఒక్కరు ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం జరిపించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు విజయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుపతమ్మ, వెంకటమ్మ, ఆశా కార్యకర్త సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ జల్మాజేడు, సూర్యవంశం రా ము, కురుమయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

వనపర్తి రూరల్ : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఇన్‌చార్జ్ సీడీపీవో హజీరా బేగం గ్రామ ప్రజలకు సూచించారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని ఆంజనేయులు గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం వారి ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత డిస్ట్రిక్ట్ మిషన్ కో- ఆర్డినేటర్ భాస్కర్, రాంబాబు, సుమా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బ్రాంచి ఏర్పాటు చేయండి

అమరచింత, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : అమరచింత మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాస్ శెట్టికి సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్‌బీఐ మేనేజర్‌ను బీజేపీ నాయకులు కలిసి.. 40 సంవత్సరాలుగా 17 గ్రామాల ప్రజలకు 50వేల ఖాతాతో ఒక్క యూనియన్ బ్యాంకు మాత్రమే కొనసాగుతు ందని పేర్కొన్నారు. తక్షణమే తమ గ్రామానికి ఎ స్‌బీఐ బ్యాంకు సౌకర్యం ఏర్పాటు చేయాలని కో రారు. భాస్కర్, మేర్వ రాజు, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, వాటర్ శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

బైక్ చోరీ

గోపాల్‌పేట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట ఉంచిన బైక్ చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతపూర్‌కి చెందిన వెంకటయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ పాడి గేదెలతో పాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట తన బైక్‌ను ఉంచి బ్యాంక్‌లోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బ్యాంక్ ముందు ఉంచిన బైక్ కనిపించలేదు. ఎంత వెతికినా బైక్ కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని బాధితుడు వాపోయాడు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం

వనపర్తి టౌన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : 2024 నీట్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. నీట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంబీబీఎస్ సీటు సాధించిన దళిత విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని వారి వారి నివాసాలకు వెళ్లిన ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు శాలువా పూలబొకెలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఎఫ్ గద్వాల కృష్ణ, వెంకటయ్య, కేశవులు, గట్టయ్య, చెన్నకేశవులు, అఖిల్, శశికిరణ్ పాల్గొన్నారు.